క్లుప్తంగా

నర్సుల సేవలు మరువలేనివి

సత్తుపల్లిరూరల్: రోగులకు నిరంతరం వైద్య సేవలు అందించే నర్సుల సేవలు మరువలేనివని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. బుధవారం సత్తుపల్లి మండలం కిష్టారంలోని నర్సింగ్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ప్రథమ సంవత్సరంలోకి క్యాండిల్ వెలిగిస్తూ నర్సులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోత్స్న, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మధిర: మధిర పట్టణంలో ఆర్‌వీ కాంప్లెక్స్ దగ్గర బస్టాండ్ రోడ్‌లో మునుగోటి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం మధిర పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మిరియాల వెంకటరమణ గుప్తా, సూరంశెట్టి కిషోర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ధార బాలరాజు, నగర, పట్టణ, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

గ్రూప్–1 విజేత సుజాతకు..

సత్తుపల్లి: గ్రూప్–1 ఉద్యోగం సాధించిన నవభారత్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి మంచాల సుజాతను బుధవారం యాజమాన్యం అభినందించింది. కల్లూరు మండలం పేరువంచకు చెందిన సుజాత కళాశాలలో డిగ్రీలో ఉత్తమ ర్యాంక్ సాధించిందని కళాశాల చైర్మన్ గాదె నర్సింహారెడ్డి తెలిపారు.

లక్ష్మీ సాహితికి..



లక్ష్మీ సాహితిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

వైరా: గ్రూప్–1 ఫలితాల్లో 129వ ర్యాంక్ సాధించిన మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన సంగెపు లక్ష్మీ సాహితిని బుధవారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

చింతా రాహుల్‌కు..



చింతా రాహుల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఏన్కూరు: గ్రూప్–1లో 467.5 మార్కులతో డీఎస్పీ, లేదా ఆర్డీఓ పోస్ట్‌కు ఎంపిక అవుతున్న చింతా రాహుల్‌ను పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కిరణ్, సైదయ్య, సురేష్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బోనకల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు అన్నారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించి.. స్థానిక తహసీల్ వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరావు, కోటేశ్వరావు, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

చింతకాని: మండలంలోని చిన్నమండవకు చెందిన శామకూరి ఉమామహేష్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై లక్ష్మణ్‌చౌదరి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ లంకెల గోపాలరెడ్డి ట్రాక్టర్‌లో ఇసుక నింపుకునేందుకు మున్నేరులోని ఇసుక ర్యాంప్ వద్దకు వెళ్లగా, సీరియల్ విషయమై ఉమామహేష్ గొడవ పడి రాయితో కొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన గోపాలరెడ్డికి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

అ'సమగ్ర'మేనా..?



ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు (ఫైల్)

సమస్యల వలయంలో సమగ్రశిక్షా ఉద్యోగులు

- 18 సంవత్సరాలుగా పోరాటం
- రాష్ట్ర ప్రభుత్వ హామీలు అమలు చేయాలని డిమాండ్

ఏన్కూరు: సమస్యల వలయంలో సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారు. విద్యాశాఖ – సమగ్రశిక్షణలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని 18 సంవత్సరాల నుంచి నిరసనలు, ఆందోళనలు, పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు 2023 ఆగస్టు, సెప్టెంబర్‌లో సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సమస్యలు పరిష్కరిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఏడాది దాటినా సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని 'సమగ్ర' ఉద్యోగులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 19,600మంది ఉద్యోగులు..

రాష్ట్రస్థాయిలో 19,600 మంది, జిల్లాలో 650మంది సమగ్రశిక్షా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరు జిల్లా విద్యాశాఖధికారి కార్యాలయం, మండల వనరు కేంద్రాలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, పాఠశాలలు, భవిత కేంద్రాల్లో ఏంఐసీ కోఆర్డినేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మెసెంజర్లు, సీసీఓలు, సీఆర్‌పీలు, పీటీఐ, సీఆర్‌టీలు, ఎఎన్‌ఎంలు, అకౌంటెంట్లు, వాచ్‌మెన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, స్వీపర్లు, వంట పనులు చేస్తున్నారు. వీరు గత కొన్ని సంవత్సరాలుగా పనులు చేస్తున్న వీరిని రెగ్యులర్ చేయకపోగా.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. సమస్యల పరిష్కారానికై ఆందోళనలు, సమ్మెలు, పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు మాత్రం ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సమస్యలు పరిష్కారమవుతాయని ఎదురు చూసిన ఉద్యోగుల ఆశలు ఫలించలేదు.

సమగ్రశిక్షా ఉద్యోగుల డిమాండ్లు..

- సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి
- ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ ఇవ్వాలి
- ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్యభీమా రూ.10 లక్షలు కల్పించాలి
- ఎస్ఎస్ఏ ఉద్యోగులకు, పదవీ విరమణ చేస్తున్న వారికి మరియు చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలి
- ప్రభుత్వ విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలి
- ఉద్యోగులందరికీ రీ–ఎంగేజ్ విధానాన్ని కల్పించాలి

రెగ్యులర్ చేయాలి..



గత 17 సంవత్సరాలు విధులు నిర్వహిస్తున్నాం. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదు. సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. విద్యాశాఖలో విలీనం చేయాలి.

– బి.లచ్చిరాం కృష్ణప్రసాద్, సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు

హామీలు నేరవేర్చాలి..



ఎన్నికలకు ముందు సమ్మె చేస్తున్నపుడు అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. విధుల్లో మృతి చెందిన వారికి రూ.10 లక్షలు ఇచ్చి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. టీఏ, డీఏ లతో పాటుగా.. ప్రసూతి సెలవులు ఇవ్వాలి.

– సీహెచ్.రుద్రగిరి, మేసెంజర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మకం



వైరారూరల్: సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



చింతకాని: ప్రారంభిస్తున్న తహసీల్దార్ అనంతరాజు

వైరారూరల్: రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడం దేశంలోనే చరిత్రాత్మకమని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. మండలంలోని వల్లాపురం గ్రామంలోని చౌకదుకాణంలో బుధవారం లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం వల్లాపురం నుంచి పాలడుగు వరకు అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాల వ్యవధిలోని ఆరు గ్యారంటీలు అమలు చేయడంతో పాటు రైతు రుణమాఫీ పథకాలను అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి రంగారావు, మండల, పట్టణ అధ్యక్షులు వెంకటనర్సిరెడ్డి, సీతరాములు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్/తల్లాడ: సత్తుపల్లి మున్సిపాలిటీలోని 20వ వార్డులో, తల్లాడలోని నారాయణపురంలో ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బియ్యం పథకాన్ని లబ్ధిదారులకు స్వయంగా అందించారు. కార్యక్రమంలో మట్టా దయానంద్, దోమ ఆనంద్‌బాబు, చెన్నారావు, కమల్‌పాషా, ప్రసాద్, పద్మజ్యోతి, కృష్ణయ్య, నాగభూషణం, సామేలు, షాకీర్, కోటేశ్వరరావు, శ్రీను, తహసీల్దార్ యోగేశ్వరరావు పాల్గొన్నారు.

వేంసూరు: వేంసూరులో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్, తహసీల్దార్ బాజ్జీ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, సకినవీడు గ్రామాల్లో బుధవారం రేషన్ దుకాణాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ బియ్యాన్ని డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ ప్రతాపరెడ్డి, జాన్‌రెడ్డి, వెంకటనారాయణ, రామకోటేశ్వరరావు, పుల్లారావు, విజయభాస్కరరెడ్డి తదితరులున్నారు.

చింతకాని: సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని చింతకాని, ప్రొద్దుటూరు గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ కూరపాటి అనంతరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, చింతకాని సొసైటీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తల్లాడ: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, తదితరులు

తల్లాడ/కల్లూరురూరల్: మండలంలోని నూతనకల్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గంగదేవిపాడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి బుధవారం ప్రారంభించారు. అనంతరం తల్లాడ రైతు వేదిక వద్ద రూ. 2,30,266ల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అదే విధంగా కల్లూరురూరల్ మండలంలోని లింగాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నిరజాదేవి, తహసీల్దార్ పులి సాంబశివుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యబాబు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కాంతారావు, శ్రీను, సుబ్బారావు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



సిలువ మార్గ ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

మధిర: యేసుక్రీస్తు బోధనలు, ఆయన అనుసరించిన మార్గం అనుసరణీయమని ఫాదర్ తమ్మి పేర్కొన్నారు. బుధవారం సిరిపురంలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ఘనంగా సిలువ మార్గ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్ష తీసుకున్న స్వాములు క్రీస్తు వేషం వేసి సిలువపై కొట్టబడి మరణం పొందిన మార్గాన్ని క్రైస్తవులు కళ్లకు కట్టినట్టుగా చూపించారు. 14 స్థలాల్లో ఏసు ప్రభువు మరణ వృత్తాంతాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో పంతులు బుజ్జి, పంతులు నాయుడు, పంతులు గాబ్రిల్, పంతులు ప్రసాద్, సిస్టర్స్, సిరిపురం బాల యేసు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని ఇన్‌చార్జ్ ఎంఈఓగా రామారావు



ఎం.రామారావు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామారావును ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖాధికారిగా నియమిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న వీరపనేని శ్రీనివాసరావు గత నెల 31న ఉద్యోగ విరమణ చేయగా.. రామారావు ఇన్‌చార్జ్ ఎంఈఓగా నియమించారు. దీంతో ఆయనను మండల అధికారులు, హెచ్‌ఎంలు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

మత్కేపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా శ్రీనివాసరావు



గండేపల్లి శ్రీనివాసరావు

చింతకాని: మండలంలోని మత్కేపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గండేపల్లి శ్రీనివాసరావుకు పాఠశాల హెచ్‌ఎం అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన వీరపనేని శ్రీనివాసరావు గతనెల 31న ఉద్యోగ విరమణ పొందటంతో గండేపల్లి శ్రీనివాసరావుకు హెచ్‌ఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

భూముల వేలాన్ని ఆపాలి



వైరా: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



సత్తుపల్లిలో..

వైరా/సత్తుపల్లి/ఏన్కూరు/తల్లాడ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో 400 ఎకరాల భూముల వేలాన్ని ఆపాలని వైరా, సత్తుపల్లి, తల్లాడ, ఏన్కూరు మండలాల్లో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నల్లబ్యాడ్జీలతో.. ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు పాండు, సర్వేశ్వరరావు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, సత్తుపల్లి, వైరా డివిజన్ కార్యదర్శులు శీలం సత్యనారాయణరెడ్డి, భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. వేలాన్ని అడ్డుకున్న విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేలాన్ని ఆపాలని.. లేకుంటే విద్యార్థుల ఆందోళనకు మద్ధతుగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు మోహన్‌రావు, నాగేశ్వరరావు, నరేష్, మస్తాన్ రాజు, సైదులు, బస్విరెడ్డి, రాములు, రాజయ్య, సీపీఎం డివిజన్ కార్యదర్శి వీరభద్రం, నాగేశ్వరావు, బాలాజీ, లెనిన్, రాములు, శ్రీనివాసరావు, జయరాజు, సుధాకర్, చలపతిరావు, శ్రీనివాసరావు, రాజబాబు, రమేష్, శ్రీహరి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం..

పెనుబల్లి/ఎర్రుపాలెం/కారేపల్లి: యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని కోరుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరస తెలిపారు. అనంతరం పెనుబల్లిలోని వీయంబజార్ రింగ్ సెంటర్లో, ఎర్రుపాలెంలోని రింగ్‌సెంటర్లో, కారేపల్లిలో సీపీఎం నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, వీరయ్య, నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు నరేందర్, మండల కార్యదర్శులు తిరుపతిరావు, మద్దాల ప్రభాకర్, నాయకులు సత్యం, రామచంద్రుడు పాల్గొన్నారు.

ముగిసిన కోటమైసమ్మ బ్రహ్మోత్సవాలు



సంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు

కారేపల్లి: మండల పరిధిలోని ఉసిరికాయలపల్లిలో కొలువుతీరిన శ్రీకోటమైసమ్మతల్లి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిసాయి. మార్చి 31వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరిగిన శ్రీకోటమైసమ్మతల్లి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలను అలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సాట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావులు పర్యవేక్షించగా, ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాశ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. అనంతరం సింగరేణి మర్చంట్ అసోసియేషన్ ఇల్లందు వారి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బియ్యం, దుస్తులు పంపిణీ



బియ్యం, దుస్తులు అందజేస్తున్న దృశ్యం

మధిర: ప్రముఖ సామాజిక సేవకుడు, మధిర ఆశా మిత్ర లంకా కొండయ్య దాతల సాయంతో బుధవారం ఇద్దరు మహిళలకు బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. రాయపట్నంకు చెందిన తేళ్ల శ్రీనివాసరావు, గోళ్ల శ్రీనివాసరావు, రియల్ ఎస్టేట్ వ్యాపారి కుటుంబీకులు మధిరలో ఎర్రుపాలెం మండలం, పెనుగంచిప్రోలు మండలానికి చెందిన ఇద్దరు మహిళలకు బియ్యం, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు కండయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

కల్లూరు: కల్లూరులోని ఆర్‌టీసీ బస్టాండ్‌లో బుధవారం ప్రయాణికులకు ఎండ వేడి నుంచి ఉపశమనం కల్పించేందుకు శాంతినగర్‌కు చెందిన రిటైర్డ్ డ్రైవర్ కొత్తపల్లి గోపాలరావు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గోపాలరావుకు ఆర్‌టీసీ టీమ్ సత్తుపల్లి తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

వీల్‌చైర్ వితరణ



వీల్‌చైర్ అందిస్తున్న ట్రస్టు నిర్వాహకురాలు అన్నపూర్ణ

పెనుబల్లి: జోనెబోయిన ట్రస్ట్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో రెండు కాళ్లు పనిచేయని స్థితిలో ఉన్న యువతికి బుధవారం ట్రస్ట్ నిర్వాహకురాలు జోనెబోయిన అన్నపూర్ణ వీల్‌చైర్ వితరణగా అందజేశారు. మండలంలోని వీయంబంజర్ ఎంప్లాయిస్ కాలనీకి చెందిన దొంతు రమాదేవికి అనారోగ్యంతో రెండు కాళ్లు చచ్చుపడి పనిచేయకపోవడంతో నడవలేని స్థితిలో ఇబ్బంది పడుతుంది. అలాగే రమాదేవికి తల్లి అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంది. తండ్రి కూలీ పనులు చేస్తూ రమాదేవిని, ఆమె తల్లిని పోషిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ పరిస్థితిని తెలుసుకున్న జోనెబోయిన ట్రస్ట్ నిర్వాహకురాలు జోనెబోయిన అన్నపూర్ణ రూ.8 వేల విలువైన వీల్ చైర్‌ను యువతి తండ్రికి అందించారు. కార్యక్రమంలో నాయకులు మేకతొట్టి కాంతయ్య, గోగినేని రమేష్, మిట్టపల్లి కిరణ్, వంగా నిరంజన్, భూక్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్

ఎర్రుపాలెం: మండలంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థి స్వర్గీయ అమరా జనార్ధన్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అమరా శ్యామ్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన శ్రీసరస్వతి దేవి విగ్రహాన్ని బుధవారం మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు ఆవిష్కరించారు. అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మురళీమోహన్‌రావు, పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

బహుజన నాయకుడు సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లో గౌడ సంఘ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ నాయకులు, బహుజన నాయకులు పలు గ్రామాల్లోని పాపన్న గౌడ్ విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల కోసం బహుజనులంతా కలిసికట్టుగా పోరాడాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



వైరా: పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



వేంసూరులో..

రాజీవ్ యువవికాసానికి 4 కౌంటర్లు

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీలో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు అందించేందుకు నాలుగు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, క్రిస్టియన్ మైనార్టీలకు చెందిన 21 నుంచి 55 సంవత్సరాలలోపు వారు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు పాస్‌ఫొటో, ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లను, యూనిట్ వివరాలతో ఈ నెల 14వ తేదీలోగా అందించాలని పేర్కొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ లోగల శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి దేవాలయం వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని పంచామృతాలతో అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అర్చకులు కొదమసింహం లక్ష్మణాచార్యులు, ఫణికుమారాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, వాసు, శ్రీను, బాపయ్య పాల్గొన్నారు.

రైతులను వేధిస్తే సహించం



మాట్లాడుతున్న ఆనందరావు

బోనకల్: మండలంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రైతులను వేధిస్తే సహించబోమని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అధికారులను, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కలకోట నుంచి మోటమర్రి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రైతులను సంప్రదించకుండా రైతుల భూముల నుంచి పరిమితికి మించి మట్టి తోలుతున్నారని, ఏంటని ప్రశ్నించిన రైతులను అమర్యాదగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇంటర్నేషనల్ స్కూల్ వరకు వేస్తున్న రోడ్లలో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో ఏఐకేఎస్ మండల అధ్యక్షులు కొంగర బాస్కర్ రావు, గుంపుల జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల గ్రేస్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై ఎస్ఐ విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు. బెట్టింగ్‌యాప్స్ ఫ్రాడ్, ఐపీఎల్ టిక్కెట్ ఫ్రాడ్, ఇంపర్‌సొనేషన్ మోసాలు, నకిలీ బెట్టింగ్ యాప్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రేస్ కళాశాల ప్రిన్సిపాల్ కౌషిక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.